సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 19 । మే । 2023



కోతుల అక్రమ రవాణా

వన్య ప్రాణులను పట్టి, అక్రమంగా రవాణా చేయబోయిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్ పేర్కొన్నారు. 8లో



ఉసురు తీసిన ఆలుమగల కొట్లాట

ఆలుమగల కొట్లాటలో క్షణికావేశానికి లోనైన భార్య నీటి కుంటలో దూకింది. భార్యను కాపాడే ప్రయత్నంలో ఇద్దరూ మృతి చెందారు. 8లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్‌లు నిర్వహించారు. అందులో అందరికీ నెగటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీసీపీఆర్ టెస్టులు 12 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

వీఓఏలపై అధికారుల ఒత్తిడి సరికాదు

ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి యశోద



వీఓఏల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి యశోద

జోగిపేట(అందోల్): వీఓఏలపై అధికారుల ఒత్తిడి సరికాదని, సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.యశోద అన్నారు. జోగిపేటలో ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె గురువారం నాటికి 32వ రోజుకు చేరుకుంది. శిబిరాన్ని యశోదతో పాటు వచ్చిన బృందం మద్దతుగా దీక్షలో కూర్చొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోని 18,608 మంది వీఓఏల కుటుంబాలలో వెలుగు నింపాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు వీఎల్ఆర్, అభయ హస్తం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల జిల్లా కోశాధికారి మల్లన్న, జిల్లా నాయకులు ఆంజనేయులు, విజయ వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: ఉమ్మడి మెదక్ జిల్లాలోని షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్ గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సిద్దిపేట జిల్లాలో 2023–24 గాను ఒకటో బ్యాచ్‌లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 21 న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 17వ తేదీ నుంచి www.tsstudycircle.co.in హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలన్నారు.

కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐకేపీ వీఓఏలు

కొండాపూర్(సంగారెడ్డి): ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22వ తేదీన నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. ఐకేపీ వీఓఏలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సంగారెడ్డిలోని ఐబీ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా వీఓఏలు తక్కువ వేతనంతో పనిచేస్తూ బతకలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం 32 రోజులుగా సమ్మె చేస్తున్న వారిని బెదిరించడం మాని సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ రామారావు



సోలక్‌పల్లిలో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్ రామారావు తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ రామారావు పిలుపునిచ్చారు. గురువారం జిన్నారం మండలంలోని కొడకంచి, సోలక్‌పల్లి గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య, డంప్‌యార్డుల నిర్వహణ, చెత్త సేకరణ, మొక్కల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు, సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. కొడకంచిలో పాశుధ్య నిర్వహణ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ముందుండాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను ప్రతీఒక్కరు తప్పక పాటించాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ వెంట డీపీఓ సురేశ్‌మోహన్, డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ సంతోష్, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

భానుడి భగభగ..



- కల్హేర్‌లో 41.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత
- కంది, హత్నూరలోనూ హాట్ హాట్
- బెంబేలెత్తుతున్న జిల్లా వాసులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: భానుడి ప్రతాపానికి జనం అల్లాడుతున్నారు. మండుటెండలతో జిల్లా అట్టుడుకుతోంది. పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. గురువారం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. కల్హేర్‌లో ఏకంగా 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే కంది, హత్నూర మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఈ రెండు చోట్ల కూడా 40.5, 40.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే కోహీర్, వట్‌పల్లి, సదాశివపేటలోనూ 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రత రికార్డు కావడంతో జనం అల్లాడుతున్నారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలోనూ 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దేశంలో వాయువ్య ప్రాంతం నుంచి వీస్తున్న వేడిగాలుల ప్రభావంతో రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటడంతో జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉదయం పూట ప్రయాణం..

- ఎండల తీవ్రతను తట్టుకోలేక ప్రజలు ఉదయం పూట ప్రయాణాలకే ప్రాధన్యత ఇస్తున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.
- చాలా వరకు ఉదయం 4 నుంచి 12 గంటల లోపు ప్రయాణించేందుకు మొగ్గు చూపుతుండటంతో ఈ వేళల్లో బస్సులు కిక్కిరి పోతున్నాయి.
- మధ్యాహ్నం ప్రయాణికుల ఆక్యుపెన్సీ నిష్పత్తి తగ్గుతోందని, మళ్లీ సాయంత్రం, రాత్రి వేళల్లో ఎక్కువగా ఉంటున్నారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఉదయం 9 దాటితే చాలు..

- ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ మండిపోవడంతో ప్రజలు బయట తిరగాలంటేనే ఆందోళనకు గురవుతున్నారు.
- దీంతో జిల్లా కేంద్రం సంగారెడ్డి కిక్కిరిసి ఉండే ప్రధాన వ్యాపార కూడళ్లు సైతం వెలవెలబోతున్నాయి. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానియాలను ఎక్కువగా సేవిస్తున్నారు.
- జ్యూస్ సెంటర్లు, చెరుకు రసాలు, శీతలపానియాలు సేవించి ఉపశమనం పొందుతున్నారు. ఎండల తీవ్రతకు రోడ్డుపై చిరు వ్యాపారం చేసుకునే వారు నానా అవస్థలు పడుతున్నారు.



- ముఖ్యంగా పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారుల కష్టాలు వర్ణనాతీతం. మరోవైపు ఎండల తీవ్రతకు గిరాకీలు లేకపోవడంతో ఉసూరుమంటున్నారు.

గురువారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు	
మండలం	ఉష్ణోగ్రత డిగ్రీలు
కల్హేర్	41.3
కంది	40.5
హత్నూర (గండ్ల మాచనూరు)	40.3
కోహీర్ (దిగ్వాల్)	40.2
వట్‌పల్లి (పల్వట్ల)	40.2
సదాశివపేట	39.9
జిన్నారం	39.9
గుమ్మడిదల (నల్లవల్లి)	39.8
కొండాపూర్	39.5
సిర్గాపూర్ (కద్పల్)	39.4
జహీరాబాద్ (మల్చెల్మ)	39.3
అందోల్ (అల్మాయ్‌పేట్)	39.3
సంగారెడ్డి	39.2
పటాన్‌చెరువు (రుద్రారం)	39.2
పుల్కల్	39.1
రాంచంద్రాపురం	39.1



సప్లిమెంటరీలో అవకాశం కల్పించాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు చంద్రశేఖర్



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రైవేట్ పాఠశాల నిర్వాహకంతో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయని విద్యార్థులకు సప్లిమెంటరీలో అవకాశం కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల పదో తరగతి విద్యార్థులు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. ఆందోళనకు ఏబీవీపీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జహీరాబాద్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు తొలి పర్మిషన్ పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా పాఠశాలను కొనసాగిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఈ విషయం తెలియకుండా జాగ్రత్త పడుతూ పదో తరగతి పరీక్షలు రాయిస్తామని చెప్పి ఫీజును ఫైన్‌తో తీసుకొని పరీక్ష సమయం వచ్చేసరికి చేతులెత్తేసారని ఆరోపించారు. హాల్ టికెట్లు రాలేదని ప్రశ్నించగా మంత్రితో మాట్లాడాము ప్రత్యేకంగా పరీక్ష రాయిస్తా మని మాయమాటలు చెప్పారన్నారు. సప్లమెంటరీ పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలను సీజ్ చేయడంతో పాటు జహీరాబాద్ ఎంఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శశాంక్, నగర కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.

జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలి

ఈడబ్ల్యూ ఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఈడబ్ల్యూ ఐడీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్: జిల్లాలో మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఈడబ్ల్యూ ఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మన ఊరు మన బడి పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ఈఈలు, డీఈ లు, ఏఈలు, ఎంఈఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, అందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా తీర్చిదిద్దడానికి మన ఊరు మన బడి కార్యక్రమం చేపట్టిందన్నారు. చేపట్టిన అన్ని పనులను జూన్ 10 లోగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మన ఊరు మన బడి కింద 441 పాఠశాలల్లో పనులు చేపట్టామని తెలిపారు. ఈ పాఠశాల మన ఊరు మనబడి కింద ఆధునీకరించబడింది అని బోర్డు పెట్టాలన్నారు. జరిగిన అభివృద్ధిపై విద్యార్థుల తల్లిదండ్రుల తెలియజేయాలన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద సంగారెడ్డి, కంది, సదాశివపేట, నందికంది, జహీరాబాద్, దిగ్వాల్ పాఠశాలల్లో చేపట్టిన పనులను కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, అధికారులు పాల్గొన్నారు.

ఐలాపూర్ బాధితులకు న్యాయం చేయండి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో అక్రమ నిర్మాణాల పేరిట ఇళ్ల కూల్చివేతలో నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఐలాపూర్ భూ కబ్జాలను ఆపాల్సిన అధికారులు, పాలకులు సరైన సమయంలో స్పందించకుండా దళారులకు సహకరించడంతోనే సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. గురువారం సాయంత్రం ఆయన ఐలాపూర్ భూ బాధితులను పరామర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నిర్వాకం కారణంగానే పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొన్ని దశాబ్దాలుగా కోర్టు వివాదాల్లో ఉన్న భూములను కాపాడటంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఆ భూముల క్రయవిక్రయాల్లో ఎమ్మెల్యేకు వాటా ఉందని ఆరోపించారు. పేదలకు ఆ భూములను అమ్మిన ముఠా, కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: వివిధ శాఖల్లోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) సివిల్ ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ కోసం టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో జరుగనున్న కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ శాఖలలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులకు ఈనెల 21, 22వ తేదీన రాత పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు అర గంటలోపు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. జిల్లాలో సీబీఆర్టీ పరీక్ష నిర్వహణ కోసం పటాన్‌చెరు మండలం రుద్రారం వద్దగల గీతం యూనివర్సిటీలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలకు 300 మంది హాజరు కానున్నట్లు చెప్పారు. అభ్యర్థులు టీఎస్పీ ఎస్సీ వెబ్ సైట్ ద్వారా హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లనుమూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.

కేజీబీవీల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి

కొండాపూర్(సంగారెడ్డి): కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఎస్ఓలు, సీఆర్‌టీలు, ఇతర సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన పీఆర్సీకి అనుగుణంగా బేసిక్ పే వర్తింపజేయాలన్నారు. జిల్లాలో ఉన్న 17 కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు మే 22వ తేదీన సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేశ్వరి, విశాలాక్షి పాల్గొన్నారు.

వీగిపోయిన అవిశ్వాసం



సమావేశానికి హాజరైన అధికారులు, డైరెక్టర్లు

13 మంది డైరెక్టర్లకు ఆరుగురు మాత్రమే హాజరు

కంది(సంగారెడ్డి): కంది పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. 15 రోజుల క్రితం అవిశ్వాస తీర్మాన నోటీస్‌ను డీసీఓ తుమ్మ ప్రసాద్‌కు అందజేశారు. దీంతో గురువారం కందిలోని పీఏసీఎస్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు నిర్వహించిన సమావేశానికి 13 మందికిగాను ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. అవిశ్వాసంపై చర్చించేందుకు కనీసం తొమ్మిది మంది డైరెక్టర్లు కావాల్సిఉండగా కేవలం ఆరుగురు రావడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఇన్‌చార్జి డీసీఓ ఎస్టేర్ రాణి ప్రకటించారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఇందిర, ఆంజనేయులు, డైరక్టర్లు యాదగిరి, మాణిక్ రెడ్డి, మల్లేశం, రాజగౌడ్, నర్సింగ్, వీరమణి, కంది సీఈఓ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా సన్మానం

ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: సేవలకు గుర్తింపుగా సన్మానం చేస్తున్నట్లు ఎస్పీ రమణకుమార్ అన్నారు. గురువారం అధికారులతో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఈ ఏడాది గడిచిన ఐదు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్స్‌కు చెందిన పది కేసుల్లో నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష పడే విధంగా కృషి చేసిన జె.శ్రీనివాస్ రెడ్డి, కె.రమేశ్, కె.వెంకటేశం, కె.రాఘవేందర్‌ను ఎస్పీ ఘనంగా సత్కరించారు. సమావేశంలో డీఎస్పీలు రవీంద్రారెడ్డి, భీమ్‌రెడ్డి, రఘు, వెంకట్ రామ్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ బి.రమేశ్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులను అభినందిస్తున్న ఎస్పీ రమణకుమార్

ప్రైవేట్ టీచర్లకు అడ్మిషన్ల పరీక్ష

- పిల్లలను చేర్పిస్తేనే జీతాలు
- స్కూల్ యాజమాన్యాల తెరవెనుక నిర్ణయాలు
- ఇంటింటికి వెళ్లి అడ్మిషన్స్‌కు టార్గెట్
- తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఫీజు వసూలుకు హుకూం

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డితో పాటు ప్రధాన పట్టణాల్లో ప్రైవేట్ స్కూల్స్‌కు నిలయాలు. జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో 423 ప్రైవేట్ స్కూల్లో విద్యా వ్యాపారమే పరమావధిగా లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నాయి.

- జిల్లాలోని 423 ప్రైవేట్ స్కూల్స్‌లో పనిచేసే దాదాపు 25 వేలకు పైగా ప్రైవేట్ టీచర్లు వాటి యాజమాన్యాల చేతిలో అష్టకష్టాలు పడుతున్నారు.
- పాఠశాలలు ప్రారంభం కాకముందే వేసవి సెలవుల్లోనే పాఠశాలలన్నీ అడ్మిషన్ల హడావుడిలో పడిపోయాయి. అయితే అడ్మిషన్లు రావాలంటే మార్కెటింగ్ స్ట్రాటజీనీ ఫాలో అవ్వాలి కాదా.
- అందుకే తమ స్కూల్ టిచర్లనే సేల్స్ స్టాఫ్‌గా మార్చేస్తున్నాయి. తెలంగాణలోని పలు పాఠశాలలు, టీచర్లకే స్కూల్ అడ్మిషన్ బ్రోచర్లు, ఫారమ్స్ ఇచ్చి ఉదయం 7.30 గంటలకు ఇంటింటికి వెళ్లి మార్కెటింగ్ చేయమంటున్నారని వినికిడి.
- విద్యార్థులను జాయిన్ చేయించాల్సిందేనని టార్గెట్ విధిస్తున్నారు. ఇలా తెరవెనుక జరిగే నిర్ణయాలకు వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



- అంతేకాకుండా కొన్ని కార్పొరేట్ యాజమాన్యాలు టీచర్స్ ద్వారా విద్యార్థుల ఫీజులు వసూలు చేయిస్తున్నారు. వేసవిలో, స్కూల్స్ ప్రారంభమైన తరువాత ఇంటింటికి వెళ్లి మీ పిల్లలను మాస్కూల్లో జాయిన్ చేయించండి అంటూ ప్రాధేయ పడాల్సిన పరిస్థితి నెలకొంది.
- స్కూల్ యాజమాన్యం పెట్టే టాస్కులతో ప్రైవేట్ స్కూల్ టీచర్స్ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కరోనా పరిస్థితుల్లో ప్రైవేట్ టీచర్స్ దయనీయమైన దుస్థితిని ఎదుర్కొన్నారు.
- ప్రభుత్వ ఉపాధ్యాయులు సమస్యల గురించి ఉద్యమాలు చేస్తే వారికి ఉపాధ్యాయ సంఘాలు అండదండలు ఉంటాయి. కానీ ప్రైవేట్ స్కూల్ టీచర్లు వేలాది సంఖ్యలో ఉన్న వీరి తరఫున మాట్లాడడానికి ఉపాధ్యాయ సంఘాలు లేవు.
- ప్రజాప్రతినిధులతోపాటు ప్రభుత్వం పట్టించుకోదు. ప్రైవేట్ స్కూల్స్ టీచర్స్ ఎవరి మీద ఆధారపడకుండా యాజమాన్యాలు ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా కుటుంబ పోషణకు తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వరిస్తున్నారు.
- ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు పెట్టిన నిబంధనలు తు.చ. తప్పకుండా పాటిస్తూ వారి విద్యా వ్యాపారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.
- ప్రైవేట్ స్కూల్ టీచర్స్‌ను స్కూల్ యాజమాన్యం కార్పొరేట్ వ్యవస్థ వారిని రకరకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇందులో ప్రధానంగా టీచర్స్ జీతంలో పీఎఫ్, ఈఎస్ఐ అని కుంటిసాకులు చెబుతూ వారి మొత్తం శాలరీలో 20 శాతం కాలేజ్ యాజమాన్యానికి పొందే విధంగా టీచర్స్ కనిపించని దోపిడీ చేస్తున్నారని పలువురు వాపోయారు.
- కొందరు శాలరీ స్లీప్‌లు కూడా ఇవ్వరని చెబుతున్నారు.
- విద్యార్థులను చేర్పించే బాధ్యత టీచర్స్‌దే. వారిపై అదనపు భారం మోపుతూ అడ్మిషన్ చేస్తేనే జీతాలు ఇస్తామంటూ హుకుం జారీ చేస్తున్నారు.
- ఇంటింటికి వెళ్లి పిల్లలు తమ స్కూల్లో చదివించాలని ప్రాధేయపడుతూ అడ్మిషన్ అప్లికేషన్ రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు సేకరించి అప్లికేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది.
- బోధనతో పాటు తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఫీజులు వసూలు చేయమని ఒత్తిడికి లోనయ్యేలా చేస్తున్నారు.
- కుటుంబ పోషణకు తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇచ్చిన టార్గెట్‌ను తు.చ. తప్పకుండా నిర్వర్తించడమే తమ ముందున్న ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నారు.
- కొత్తగా వచ్చిన డీఈఓ తమ కష్టాలు తెలుసుకునే ప్రయత్నం చేయాలని పరోక్షంగా ప్రైవేట్ స్కూల్ టీచర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు.

సాక్షి
సంగారెడ్డి

గురువారం । 18 । మే । 2023



రెండు గుంటలు.. పన్నెండు రకాలు
రెండు గుంటల భూమిలో పన్నెండు రకాల కూరగాయలు సాగు చేసి కౌడిపల్లి మండలం కంచన్‌పల్లికి చెందిన రైతు ఆదర్శంగా నిలుస్తున్నాడు. 8లో



మానసిక ఉల్లాసానికి క్రీడలు
మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. 9లో

ఒకరికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

ఎండల తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ శరత్



సంగారెడ్డిటౌన్: జిల్లాలో ఉష్ణోగ్రతల తీవ్రత రోజు రోజుకు అధికంగా నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ శరత్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వడగాలులు వీస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక జనసంచారం ఉండే ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సరిపడా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రత వల్ల ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల దాహార్తి తీర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరమై బయటకు వెళ్లాలన్నారు. ఎక్కువగా నీటిని తాగాలని, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ లాంటివి తీసుకోవాలన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి సకాలంలో చికిత్స పొందాలని సూచించారు.

సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డిటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పోటీల నిర్వహణ ఏర్పాట్ల ప్రణాళికపై జిల్లా యువజన క్రీడలు, విద్య, గ్రామీణాభివద్ధి, పంచాయతీ, మిషన్ భగీరథ, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేసేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో క్రీడలను మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి రాంచందర్ రావు, జెడ్పీసీఈఓ ఎల్లయ్య, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి గోవింద్‌రామ్, పీడీ గీతా, జిల్లా సైన్స్ అధికారి విజయ్ కుమార్, డీఈఓ వేంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బెదిరింపులు సరికాదు

కొండాపూర్(సంగారెడ్డి): శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలను బెదిరించడం సరికాదని ఐకేపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వీఓఏలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 31 రోజులుగా సమ్మె చేస్తుంటే పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అధికారులు బెదిరింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. బెదరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఓఏల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

కంది(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలరెడ్డి పిలుపునిచ్చారు. రెండోసారి పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితురాలు కావడంతో బుధవారం కంది మండల నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభివద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, మహేష్ గౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షురాలు నిర్మలరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

మండే ఎండ.. జాగ్రత్త సుమా

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రస్తుత పరిస్థితుల్లో ఎండ నుంచి ఏవిధంగా ఆరోగ్యం కాపాడుకోవాలి. అనారోగ్య సమస్యలు ఎదురైతే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశం పై సాక్షి ప్రముఖ వైద్య నిపుణులచే ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. బుధవారం జిల్లా కేంద్రం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి జనరల్ ఫిజిషియన్ రాజ్ కుమార్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది.

డాక్టర్ సలహాలు, సూచనలు..



డాక్టర్ రాజ్ కుమార్, సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి

- ఎండకాలంలో వదులుగా ఉండే దుస్తులు, తేలికపాటి లేత రంగు దుస్తులు ధరించాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు కళ్లకు కూలింగ్ గ్లాసెస్, తలకు క్యాప్, ముఖానికి స్కార్ఫ్ పెట్టుకోవాలి. తరచూ నీళ్లు తాగుతుండాలి. మసాలాలు, నూనె ఎక్కువగా ఉండే పదార్థాలు తినకుండా ఉంటే మంచిది. పళ్ల రసాలు తాగుతూ ఉండాలి. ప్రధానంగా శరీరం లవణాలను కోల్పోకుండా కాస్త ఉప్పు వేసిన ద్రవపదార్థాలు తీసుకోవాలి. వేసవిలో కూల్‌డ్రింక్స్‌కు బదులు కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవడం మంచిది. బయటకు వెళ్లకుండా ఉండాలి. వేసవిలో మద్యానికి దూరంగా ఉండాలి
- శరీరంలో నీరు తక్కువగా ఉండకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నీటిని తాగుతూ ఉండాలి. ఎప్పుడైతే శరీరంలో తగినంత నీరు లేదో రక్తం సాంద్రత పెరుగుతుంది. ఇది క్రమంగా రక్త ప్రసరణకు ఇబ్బంది కలిగించే క్లాట్స్ (అడ్డంకి) తయారయ్యేందుకు దోహదపడుతుంది. రక్తంలో క్లాట్స్ తయారైతే అది మెల్లగా కిడ్నీలు, రక్త నాళాలపై ప్రభావం చూపుతూ కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులకు దారి తీస్తుంది. అలాగే మూత్ర సంబంధిత వ్యాధులు వస్తాయి. అందుకే శరీరంలో నీటి పరిమాణాన్ని తగ్గకుండా చూసుకోవాలలి .
- ఎండాకాలంలో రోజూ మూడు టీ స్పూన్ల సబ్జా గింజలను నానబెట్టుకుని తినాలి. లేదా గాజు గ్లాసులో మూడు వంతుల నీళ్ళను పోసి అందులో ఒక టీ స్పూన్ జీలకర్ర, కొంచం కండ చక్కర (మిశ్రి) వేసి ఉదయం నానబెట్టి మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఆ నీటిని క్రమం తప్పకుండా తాగితే మంచి ఫలితాలు వస్తాయి. శరీరంలో ఉన్న అధిక వేడిని ఇది నివారిస్తుంది. ఉదయాన్నే కలబంద గుజ్జును సన్నగా తరుగుకుని తినడం వల్ల ఒంట్లో వేడి తగ్గుతుంది. నేరుగా తినలేని వారు రుచి కోసం కొంచెం చక్కర కలుపుకుని తినవచ్చు.
- వడదెబ్బ అంటే పరిసరాల్లో ఎక్కువ ఉష్ణోగ్రత వల్ల శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమవడం. చాలా వేడిగా ఉన్న వాతావరణంలో, సరైన మోతాదులో ద్రవపదార్థాలని తీసుకోకుండా, తీవ్ర వ్యాయామం లాంటి చురుకైన పనులవలన కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది.
- హీట్‌వేవ్‌ను వడగాల్పులు అంటాం. ఏటా వడగాల్పుల తీవ్రత కూడా పెరుగుతుండటం, ఎండాకాలంలో సాధారణంగా నమోదయ్యే ఉష్ణోగ్రతల కంటే 4 నుంచి 5.4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదైతే ఆ పరిస్థితులను హీట్‌వేవ్ అంటాం. కొన్నిసార్లు అది 6.4 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా ఉంటుంది. దీనిని స్ట్రాంగ్ హీట్ వేవ్ అంటాం.
- వడ దెబ్బ తగిలినప్పుడు గుండె వేగంగా కొట్టుకుంటూ, శరీరం నుంచి చెమట రావడం నిలిచిపోతుంది.
- చర్మం పొడిబారిపోతుంది. మెదడు సరిగా పని చేయదు. వెంటనే చికిత్స అందించకపోతే



ఒక్కోసారి కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. వడదెబ్బ తగిలిన కొందరిలో కొన్ని నిమిషాల్లోనే ఇవన్నీ జరిగే ప్రమాదం ఉంది.
- ఒంటి నొప్పులు, అలసట, మైకం, వికారం, కళ్లు తిరగడం, చెమట, తక్కువ మూత్ర విసర్జన, గుండె వేగంగా కొట్టుకోవడం, వాంతులు, స్పృహ కోల్పోవడం, అధిక దాహం వంటివి కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో కిడ్నీ ఫెయిల్యూర్, బ్రెయిన్ వాపు, నరాలు దెబ్బతినడం, హార్ట్ ఫెయిల్యూర్, కోమాలోకి వెళ్లడం, గుండెకు రక్తప్రసరణ తగ్గడం జరుగుతుంది.
- బయటకు వెళ్లే వాళ్లే కాదు ఇంట్లో ఉండే చిన్నపిల్లలు, వృద్ధులు కూడా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. వడదెబ్బ తగిలినప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉంటుంది. సరైన సమయంలో వైద్యులను సంప్రదించాలి.

బీఆర్క్ తొలిబ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు



విద్యార్థుల వీడ్కోలు సమావేశం

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్ పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం (డీమ్డ్) విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ తొలి బ్యాచ్ 2018–23 విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశం కిన్నెర సెమినార్ హాలులో జరిగింది. స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ సునీల్ కుమార్ స్వాగతోపన్యాసంతో సమావేశం ప్రారంభమైంది. విభిన్న కార్యక్రమాలు, వర్క్‌షాపు ద్వారా ప్రావీణ్యం సంపాదించిన విద్యార్థులను అభినందించారు. 'ప్రయత్నించు, సేవ చేయి, వృద్ధిచెందు' గీతం నినాదాన్ని ముందుకు తీసుకెళ్లి, బయటి ప్రపంచంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని చివరి ఏడాది విద్యార్థులకు ఉద్బోధించారు. చిత్తశుద్ధితో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. సాంస్కృతి కార్యక్రమాలతో సీనియర్లకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు.

ఐలాపూర్ బాధితులకు అండగా ఉంటాం

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్ తండా, ఐలాపూర్ కూల్చివేతల్లో ఇల్లు కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ లోని తన కార్యాలయంలో మాట్లాడారు. ఐలాపూర్ గ్రామం, ఐలాపూర్ తండాలో ఇళ్లు నిర్మించుకొని స్థిరపడ్డ వారి ఇండ్లను అధికారులను అడ్డు పెట్టుకొని కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తనకు ఏమీ తెలియదనట్లు, సుప్రీంకోర్టులో తనపై ఓ వ్యక్తి ఆరోపణ చేశారని, తన ఎమ్మెల్యే పదవికి ముప్పు ఉందని గ్రహించి తెర వెనక ఉండి పేదల ఇళ్లను కూల్చివేయడంలో ప్రధాన పాత్ర పోషించి ఈ నాటకానికి తెర తీసారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సూచన మేరకు 1200 ఎకరాల విస్తీర్ణంగల ఐలాపూర్ భూములను పరిశ్రమలకు కట్టబెట్టడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. నిర్మాణాలకు అనుమతులు వారే ఇచ్చి, ఇప్పుడు అక్రమ కట్టడాలు అంటూ కూల్చివేయడం ఏమిటని అధికార యంత్రాంగాన్ని ఆయన ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాలని లేని పక్షంలో వారికి అండగా పోరాడతామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, భారతి నగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, పటాన్‌చెరు మండల అధ్యక్షుడు కావలి వీరేశం, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధనరాజ్, బీజేపీ నాయకులు యాదగిరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డిటౌన్: స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించడానికి ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జీహెచ్‌ఎంసీ ఏరియా ఓటర్ జాబితా అంశాలపై సంబంధిత ఆర్డీఓ, పటాన్‌చెరు, ఆర్‌సిపురం తహసిల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ఇంటి నంబర్‌లో ఆరు కన్నా ఎక్కువ ఓటర్లు నమోదైన ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఎక్కువగా ఓటర్లు నమోదైన పెద్ద గేటెడ్ కమ్యూనిటీలను గుర్తించి అవసరమైతే పోలింగ్ స్టేషన్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 1500 కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సంగారెడ్డి ఆర్డీఓ నగేష్, పటాన్‌చెరు, జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

సంగారెడ్డిటౌన్: జాతీయ రహదారి 65 కంది గ్రామం నుంచి ఓవర్ ఫ్లో అవుతున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ మున్సిపల్ పంచాయతీ అధికారులకు ఆదేశించారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, నేషనల్ హైవే అథారిటీ పీడీ, మున్సిపల్ కమిషనర్, డీపీఓ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఆర్డీఓ తదితరులతో జాతీయ రహదారిపై మురుగు నీటి పారుదల సమస్య పరిష్కారానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కంది గ్రామం నుంచి జాతీయ రహదారిపై పారుతున్న మురుగు నీటిని పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, నేషనల్ హైవే అథారిటీ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ మేనేజర్, పబ్లిక్ హెల్త్ డీఈ, ఇరిగేషన్ ఈఈ, ఏఈలు, ఆర్అండ్‌బీ ఈఈ, ఆర్డీఓ నగేష్ పాల్గొన్నారు.

కేతకిలో డీసీఎంఎస్ చైర్మన్ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ దర్శించారు. బుధవారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, పాలక మండలి చైర్మన్ నీల వెంకటేశం, సర్పంచ్‌లు జగదీశ్వర్, పరమేశ్వర్‌పాటిల్, నాయకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.33.5లక్షలు

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బుధవారం ఆలయ మండపంలో ఆలయ అధికారులు, భక్తుల సమక్షంలో కానుకలు నగదును లెక్కించారు. ముందుగా పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి లెక్కింపు ప్రారంభించారు. రూ.33,51,748 ఆదాయం వచ్చినట్లు ఈఓ శశిధర్, చైర్మన్ నీల వెంకటేశం తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



కేతకిలో డీసీఎంఎస్ చైర్మన్ తదితరులు

సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ రమణకుమార్

సంగారెడ్డి అర్బన్: బీడీఎల్–భానూర్‌కు చెందిన గోశాయి రమేశ్ గతనెల పటాన్‌చెరు నుంచి తన స్వగ్రామం వెళ్తుండగా తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌పై అవగాహన ఉండటంతో మీ సేవలో ఫిర్యాదు చేసి, బీడీఎల్–భానూర్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు అందజేశాడు. పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ సహకారంతో పోయిన సెల్‌ఫోన్ రికవరీ చేసి ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. అలాగే అందోల్ మండలం, పోసానిపేటకు చెందిన చెట్టుకింది మహిపాల్ పోగొట్టుకున్న ఫోన్ రికవరీ చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్ ఫోన్ పోగొట్టుకున్నవారు నేరుగా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి రెక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్, స్టోలెన్ మొబైల్ చేస్తే ఆ ఫోన్ పనిచేయదన్నారు.

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్



టాస్ వేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఝరాసంగం(జహీరాబాద్): యువత క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో సీఎం కప్ క్రీడల్లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ముందుగా టాస్ వేసి కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జయదేవ్, ఎంపీడీఓ సుజాత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, కేతకి ఆలయ కమిటీ చైర్మన్ నీల వెంకటేశం, ఎంపీఓ లక్ష్మయ్య, ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యాభవన్స్ పాఠశాల సీబీఎస్‌ఈ టెన్త్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. బుధవారం ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి మాట్లాడుతూ 260 విద్యార్థులు పరీక్షలు రాయగా 260 మంది ఉత్తీర్ణలయ్యారన్నారు. పాఠశాల టాపర్‌గా కె.మేఘన నిలిచిందని తెలిపారు.

ఖరీఫ్ సాగు ఖరారు

- ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- 7.19 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- అత్యధికంగా 3.50 లక్షల ఎకరాల్లో పత్తి వేసే అవకాశం
- గత ఏడాది నష్టాలతో తగ్గనున్న మినుము, పెసర సాగు
- అందుబాటులో 21వేల టన్నుల ఎరువులు



జహీరాబాద్: వచ్చే వానాకాలంలో పంటల సాగు కోసం ఏమేరకు విత్తనాలు, ఎరువులు అవసరం అవుతాయనే దానిపై వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. సకాలంలో వర్షాలు కురిస్తే 7.19 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు కానున్నాయని అంచనా వేశారు. ఒక వేళ వర్షాలు ఆలస్యంగా కురిస్తే కొంత మేర పంట సాగు తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఈ ఏడాది జిల్లాలో అత్యధికంగా పత్తి పంట సాగయ్యే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. వర్షాలు కొంత మేర తగ్గినా, కొంత మేర పెరిగినా తట్టుకునిపంట పండుతుందనే ఉద్దేశంతో రైతులు పత్తిపంట సాగు వైపు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది. దాని తర్వాతి స్థానాల్లో వరి, సోయాబీన్, కంది, మొక్కజొన్న పంటలు సాగు చేసే అవకాశం ఉంది.

7.19 లక్షల ఎకరాల్లో పంటల సాగు

- సకాలంలో వర్షాలు కురిస్తే జిల్లాలో 7.19 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఇందులో పత్తి పంట 3,50,936 ఎకరాల్లో సాగు కానుందని అంచనా.
- వరి 1,38,380 ఎకరాల్లో, కంది 83,791 ఎకరాల్లో, సోయాబీన్, 81,978 ఎకరాల్లో, మొక్కజొన్న 16,502 ఎకరాల్లో, పెసర 13,562 ఎకరాల్లో, మినుము 6,275 ఎకరాల్లో, జొన్న 841 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది.
- ఎత్తి, కంది పంటలు అమీన్‌పూర్, జిన్నారం మండలాల్లో తప్ప అన్ని మండలాల్లో సాగు కానుంది. వరి పంట జహీరాబాద్ నియోజకవర్గంలో తప్ప మిగతా అన్ని నియోజకవర్గాల్లో సాగుకానుంది.
- సోయాబీన్ పంట మాత్రం జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ ప్రాంతాల్లో మాత్రమే సాగవుతుంది. మొక్కజొన్న పంట మాత్రం జహీరాబాద్ నియోజకవర్గంలోనే అత్యధికంగా సాగు కానుంది.

మొక్కజొన్న వైపు మొగ్గు

- జూలై వరకు వర్షాలు రాకుంటే రైతులు మొక్కజొన్న పంట వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. దీంతో కొంత మేర పత్తిపంట తగ్గుతుంది.
- మినుము, పెసర పంటల సాగు కూడా తగ్గే అవకాశం ఉంది. వర్షాలు సకాలంలో వచ్చినా మినుము, పెసర పంట సాగు తగ్గే అవకాశం ఉంది.
- గత ఏడాది సాగు చేసినా పంట చేతికి అంది వచ్చిన సమాయంలో భారీ వర్షాలు పడటంతో మినుము, పెసర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- గత ఏడాది అనుభవంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల పట్ల ఆసక్తి చూపుతున్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే మొక్కజొన్న పంట పెరిగే అవకాశం ఉంది.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

- రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. ముందస్తుగా అవసరం ఉన్న ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత కింద అందించనుంది.
- వర్షాల కింద వేసుకునే రైతులకు మాత్రం జూన్ మొదటి వారంలో అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పచ్చిరొట్ట విత్తనాలను మాత్రం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది.

అవసరం మేరకు ఎరువులు



"రైతులకు అవసరం మేరకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. విత్తనాలను కూడా అందుబాటులో ఉంచుతాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గత ఏడాది మాదిరిగానే పత్తి, సోయాబీన్, వరి, మొక్కజొన్న, కంది పంటలు సమపాళ్లలో సాగయ్యే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాం.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి, సంగారెడ్డి

అవసరం మేరకు ఎరువులు

- వానాకాలం పంటల సాగుకు అవసరం మేరకు ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రైవేటు డీలర్లతో పాటు పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్, ఏఆర్ఎస్‌కే, కంపెనీ గోడౌన్లలో అందుబాటులో ఉంచారు.
- యూరియా 9868 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,343 టన్నులు, పొటాష్ 248 టన్నులు, ఎన్‌పీకేఎస్ 4,883 టన్నులు, ఎస్ఎస్‌పీ577 టన్నుల మేర అందుబాటులో ఉంచారు.
- జూన్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు 1.10లక్షల టన్నుల ఎరువులు అవసరం అవుతాయి. జూన్ మాసంలో 30 వేల టన్నుల మేర ఎవరులు అవసరం ఉంటుంది.
- ఈ లెక్కన ఎరువులు అవసరం మేరకు రైతులకు అందించేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది.

క్లుప్తంగా

పటాన్‌చెరు క్రైం సీఐగా లాలు నాయక్



సీఐ వేణుగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లాలు నాయక్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు క్రైం సీఐగా లాలు నాయక్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పటాన్‌చెరు క్రైం సీఐ బీసన్న ఇటీవలే బదిలీపై నాగార్జున సాగర్‌కు వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో సంగారెడ్డి ఎస్‌బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న లాలు నాయక్ పటాన్‌చెరు క్రైం సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు పోలీస్‌స్ స్టేషన్ పరిధిలో క్రైం రేటును తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మత్తులు చేపట్టనుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాజు తెలిపారు. జిన్నారం, సోలక్‌పల్లి, గడ్డపోతారం, ప్రకృతినివాస్, దుండిగల్‌ఎయిర్స్ అకాడమీ ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రంలో 20 బస్తాల ధాన్యం చోరీ



మాట్లాడుతున్న బాధిత రైతులు

తూప్రాన్: కొనుగోలు కేంద్రంలో 20 బస్తాల ధాన్యం చోరీకి గురైన ఘటన యావపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చాకలి స్వామి, పాక మల్లేశ్‌లు గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మంగళవారం ధాన్యం తీసుకెళ్లారు. బుధవారం ధాన్యం తూకం వేయగా తమ ధాన్యం తక్కువగా ఉందని ఖంగుతిన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు రైతులకు చెందిన 20 బస్తాల ధాన్యం చోరీ గురైనట్టు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ ధాన్యం చోరీ జరిగిందని వారు వాపోయారు. ఈ విషయంలో ఐకేపీ ఏపీఎంను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

బోరు బావిలో పడిన మేక పిల్ల

అక్కన్నపేట(హుస్నాబాద్): తెరిచి ఉన్న బోరు బావిలో మేక పిల్ల పడింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం పంతుల్‌తండాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన లావుడ్యి సమ్మయ్య మేకలను తన వ్యవసాయ పొలంలో మేపుతున్నాడు. ఈ క్రమంలో మేక పిల్లల దాహం తీర్చేందుకు తన పొలం పక్కనే చిన్నకుంట వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ తెరిచి ఉన్న బోరు బావిని గమనించని సదరు రైతు సమ్మయ్య ఆవైపుగా మేపుతున్న క్రమంలో మేక పిల్ల అందులో పడిపోయింది. చుట్టుపక్కల రైతులు, గ్రామస్తులు తీవ్రంగా ప్రయత్నించారు. అయినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని రైతులు బోరుమన్నాడు.

రెండు గుంటలు.. పన్నెండు రకాలు

- కూరగాయల సాగు భలే
- సేంద్రియ పద్ధతిలోనే పంట
- ఇంటి అవసరాలకూ వినియోగం



విరగ కాసిన మిర్చి



బెండ పంట

కౌడిపల్లి(నర్సాపూర్): ఈ రోజుల్లో వ్యవసాయం భారమవుతున్నా కొందరు రైతులు ఉన్న దాంట్లోనే పంటలు వేసి సాగు చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు తక్కువ భూమిలోనే సాగు చేసి పంటలు పండిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. రైతు రామక్రిష్ణగౌడ్‌కు వందలు, వేలల్లో భూములు లేవు. రెండు గుంటల భూమిలో పన్నెండు రకాల కూరగాయల సాగు చేశాడు. పలువురిని ఆశ్చర్యానికి గురిచేశాడు. తను పూర్తిగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పండించడమే కాకుండా ఇంటి అవసరాలకు కూడా తీర్చుకుంటున్నాడు. గతంలో ఆదర్శరైతుగా పనిచేసిన కంచన్‌పల్లికి చెందిన రామక్రిష్ణగౌడ్ పంటల సాగులోనూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సాగువివరాలు ఇలా..

- కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణగౌడ్‌కు లింగంపల్లి గ్రామ సమీపంలో మూడు ఎకరాల పొలం ఉంది.
- ఇందులో కొంత కోళ్లఫారంతోపాటు రబీలో వివిధ రకాల వరి సాగు చేశాడు.
- ఇంటి అవసరాలకు కూరగాయలు కావాలన్న ఆలోచనతో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగు చేశాడు.
- రెండు గుంటల భూమిలో పన్నెండు రకాల కూరగాయల పంట వేశాడు.
- గత మార్చి నెలలో భోజ పద్ధతిలో మడి ఏర్పాటు చేసి టమాట, వంకాయ, మిర్చి, గోరు చిక్కుడు, ఎర్ర బెండ, పచ్చబెండతోపాటు తీగ జాతి మొక్కలు బీర, సోర, కాకర, పొట్లకాయ పంటలు వేశాడు.
- దీనికి తోడు అంతర పంటగా ఆకుకూరలు గంగవాయిలు, మెంతి, కొత్తిమీర వేశారు.
- గంగవాయిలు, మెంతి కూర పంట సాగు పూర్తయింది.
- ప్రస్తుతం మిగత అన్ని పంటలు కాత కాస్తున్నాయి. గత నెలరోజులుగా కూరగాయలు తెంపి రోజువారి ఆహారంలో వండుకోవడం తోపాటు తెలిసిన వారికి ఇస్తున్నారు.
- కూరగాయల సాగుపూర్తిగా సేంద్రియ పద్ధతిలో చేస్తున్నాడు.
- దీనికోసం తునికి కేవీకేలో క్షేత్ర ప్రదర్శనతో పాటు శాస్త్రవేత్తల సూచనలు పాటించి సాగు చేస్తున్నాడు.
- పొలంవద్ద దేశీ ఆవును పెంచి ఆవుపేడా, మూత్రంతో, జీవాంమృతం తయారు చేసి వినియోగిస్తున్నాడు.
- చీడ పీడలు రాకుండా నీంఆయిల్, దశపత్ర కషాయం వినియోగించినట్లు రైతు రామక్రిష్ణగౌడ్ తెలిపాడు. ఎలాంటి రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతిలో సాగుచేసి కలుషితం కాని ఆహారం తినాలన్న ఉద్దేశంలో సాగు చేస్తున్నట్లు చెప్పాడు.
- తొమ్మిది మంది ఉండే కుటుంబంలో ఇంటి అవరాలు తీరగా బంధువులు, తెలిసిన వారికి కూరగాయాలు ఇస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ కమిషనర్ శ్వేత

చేర్యాల(సిద్దిపేట): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతన్నారన్నారు. 2023 సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.41,77,476 ఫ్రిజ్ చేశామన్నారు. త్వరలో వారివారి అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయన్నారు. బుధవారం చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాధితుడికి ఇన్‌స్టాగామ్‌లో జాబ్ ఉందని వాట్సాప్ నెంబర్‌కు మెసెజ్ వచ్చింది. అది నమ్మిన బాధితుడు ఆ నెంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు పంపాడు. తర్వాత జాబ్ కోసం అడ్వాన్స్ డబ్బులు కట్టాలని చెప్పగా సైబర్ నేరగాడు పంపిన నెంబర్‌కు ఫోన్‌పే ద్వారా రూ.10వేలు పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో బాధితుడు మోసపోయానని గుర్తించి జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్‌చేసి పిర్యాదు చేశాడని తెలిపారు.

క్రెడిట్ కార్డు వ్యాలిడిటి ముగుస్తుందని సైబర్ మోసం

సిద్దిపేటరూరల్: క్రెడిట్ కార్డు వ్యాలిడిటి ముగుస్తుందని ఓటీపీ వివరాలు తెలియజేసి సైబర్ మోసానికి గురైన సంఘటన సిద్దిపేటరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటరూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బాధితుడికి గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. సదరు బాధితునికి ఫోన్‌లో క్రెడిట్ కార్డు వ్యాలిడిటి ముగుస్తుందని, వెంటనే సమయం పొడగించాలని నమ్మబలికాడు. దీన్ని నమ్మిన బాధితుడు అతను చెప్పిన విధంగా కార్డు వివరాలు, ఓటీపీ నెంబర్ చెప్పాడు. వెంటనే బాధితుడి అకౌంట్‌లో నుంచి రూ.10వేలు డెబిట్ అయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన బాధితుడు మోసపోయినట్లుగా గుర్తించి వెంటనే జాతీయ సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి, సుమారు రూ.65వేల విలువగల బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించారు. బుధవారం కౌడిపల్లి ఏఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం..కౌడిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి వడ్ల పాండరి గత వారం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు వద్దకు వెళ్లాడు. కాగా ఇంట్లో తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని బట్టలు, ఇతర వస్తువులను చిందర వందరగా పడేశారు. బీరువాలోని అర్ధతులం ఉంగరం, తులం గుండ్లు, వెండి గొలుసు అపహరించారు. ఈ విషయంపై పాండరి మనువడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

సిద్దిపేటకమాన్: భవనం మొదటి అంతస్తు నుంచి కింద పడిన వ్యక్తి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట పట్టణం ఇందిరానగర్‌కు చెందిన కంచర్ల శ్రీనివాస్(45) కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 13వ తేదీన నర్సాపూర్‌లో పనికి వెళ్లి భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు శ్రీనివాస్ కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ బుధవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడు..

దుబ్బాక: చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లిలో జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి వార్డుకు చెందిన ఉప్పరి నర్సయ్య(85) గత నెల 30వ తేదీన రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే క్రమంలో వేగంగా వచ్చిన ఓమినివ్యాన్ నర్సయ్యను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వైద్యుల సలహా మేరకు మెరుగైనా చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధ రాత్రి మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి అల్లుడు ఉప్పరి శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఊళ్ల మధు(27) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మద్యానికి బానిసైన మధు మంగళవారం రాత్రి 9:30 గంటలకు మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందాడు. సోదరుడు భరత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి... నలుగురికి గాయాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా నలుగురికి గాయాలు అయ్యాయి.

ట్రాక్టర్ బైక్ ఢీ..



ధరావత్ తరుణ్(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ట్రాక్టర్ బైక్ ఢీ కొని కుమారుడు మృతి చెందగా తండ్రికి స్వల్పగాయాలైన సంఘటన అక్కన్నపేట మండలం నందారం స్టేజీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..ముంపు గ్రామమైన గుడాటిపల్లి గ్రామ పరిధిలోని సోమాజితండాకు చెందిన ధరావత్ తరుణ్(11), తండ్రి రాజుతో బుధవారం వ్యవసాయ బావి వద్ద పశువులకు నీళ్ల తాగించేందుకు బైక్‌పై కుమారుడిని వెంటతీసుకొని వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి వస్తుండుగా నందారం స్టేజ్ వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన ట్రాక్టర్, తమబైక్‌ను ఢీ కొట్టడంతో కుమారుడు తరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వివేక్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ జరుపుల రాములుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణ సమీపంలోని కరీంగూడకు చెందిన దశరథ్(19), మక్కల రవి అనే ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై తూప్రాన్ నుంచి కరీంగూడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని శివాలయం ఎదుట బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో దశరథ్‌కు తీవ్రగాయాలు కాగా రవికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సలహామేరకు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీ కొట్టిన లారీ



గౌరవ్వ మృతదేహం

కొండపాక(గజ్వేల్): ఆటోను లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన కిష్టాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..రాయపోల్ మండలంలోని కొత్తపల్లి నుంచి మంగళవారం రాత్రి 9 గంటలకు ఆటోలో టెంట్ హౌజ్ సామాన్లతో పాటు గంగదారి మల్లవ్వ, బొగ్గుల లక్ష్మినర్సయ్య, జూపల్లి సాయి, బొగ్గుల గౌరవ్వలు కుకునూరుపల్లి మండలంలోని చిన్న కిష్టాపూర్ గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన లారీ చిన్న కిష్టాపూర్ గ్రామ శివారులో ఆటోను ఢీకొట్టడంతో ఆటో రోడ్డు ప్రక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో వెళ్తున్న వారందరికీ తీవ్ర గాయాలవ్వగా, గౌరవ్వకు మాత్రం బలమైన గాయాలయ్యాయి. వెంటనే గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్సులో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మంగళవారం రాత్రి 11 గంటలకు మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆటో డ్రైవరు గంగదారి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవరు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

పని చేసే స్టోర్‌కి వెళ్తున్నానని చెప్పి..



మధు (ఫైల్)

దుబ్బాక: యువకుడు అదృశ్యమైన ఘటన దుబ్బాక పట్టణంలో జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన పయ్యావుల బుజ్జమ్మ, దేవయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమరుడు మధు(22) హైదరాబాద్‌లోని అల్వాల్‌లో మేకర్స్ ఆఫ్ మిల్క్ షేక్‌లో పని చేసేవాడు. గత 3 నెలల నుంచి తను పని చేసే స్టోర్లో భాగస్వామిగా పెట్టుబడి పెట్టాలని తల్లి బుజ్జమ్మను కోరాడు. అందుకు తల్లి ఒప్పుకోలేదు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తను పని చేసే స్టోర్‌కి వెళ్తున్నానని చెప్పి బట్టలు, స్టడీ సర్టిఫికేట్లు తీసుకొని ఇంటి నుంచి వెళ్లాడు. ఈ క్రమంలో తల్లి మధుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో కొడుకు పని చేసే స్టోర్‌కు ఫోన్ చేసింది. అక్కడికి రాలేదని నిర్వాహకులు చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన తల్లి బంధువులవద్ద, స్నేహితులవద్ద ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. బుధవారం మధు తల్లి బుజ్జమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొయ్య గుండు తండాలో



మేఘావత్ సంతోష్ (ఫైల్)

కంది(సంగారెడ్డి): యువకుడు అదశ్యమైన సంఘటన మండల పరిధిలోని కొయ్య గుండు తండాలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ ఖుర్షీద్ అలీ వివరాల ప్రకారం.. కొయ్యగుండు తండాకు చెందిన మేఘావత్ సంతోశ్(25) కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల15న మధ్యాహ్నం ఇంట్లోనుంచి ఎవరికీచెప్పకుండా వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే రూరల్ సీఐ 8712656719, 8712656746, నంబర్లపై సంప్రదించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

జిన్నారం(పటాన్‌చెరు): ఉద్యోగం నుంచి ఓ పరిశ్రమ యాజమాన్యం తొలగించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..జహీరాబాద్‌కు చెందిన బాబుగౌడ్(24)అనే యవకుడు బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఎలాంటి కారణం లేకుండా తనను విధుల నుంచి ఈ నెల 14న యాజమాన్యం తొలగించింది. దీంతో మనస్థాపానికి గురైన బాబుగౌడ్ సమీపంలోని మాధవాని కుంటలో వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనస్థాపంతో యువకుడు



శ్రీనివాస్ (ఫైల్)

జోగిపేట(అందోల్): తీవ్ర మనస్థాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జోగిపేట పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సామ్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం..జోగిపేటకు చెందిన కె.శ్రీనివాస్ (32) మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం 8 గంటల వరకూ ఆ గది నుంచి బయటకు రాకపోవడంతో డోర్‌ను ధ్వంసం చేసి చూడగా శ్రీనివాస్ ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కారు దగ్ధం

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. ఈ ఘటన ములుగు మండలం మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..బహిలంపూర్ ఆర్‌అండ్ ఆర్ కాలనీకి చెందిన కిష్టాగౌడ్ తన మారుతీ కారులో గజ్వేల్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కారులో ఏసీ ఎలక్ట్రిక్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒకే సారి మంటలు చెలరేగాయి. కారులో ఉన్న కిష్టాగౌడ్ అప్రమత్తమై దిగిపోవడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది.

గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరి

మెదక్ కలెక్టరేట్: గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని సీఐటీయూ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తునికి మహేశ్ ఆరోపించారు. బుధవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా సదస్సు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు.

లేగ దూడపై పులి దాడి



లేగ దూడ కళేబరం

అల్లాదుర్గం(మెదక్): అటవీ ప్రాంతంలో కట్టేసిన లేగ దూడపై పులి దాడి చేసిన ఘటన మండల పరిధిలోని కాయిదంపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, ప్రత్యేక్ష సాక్షి చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. కాయిదంపల్లి గ్రామానికి చెందిన రైతు జక్కుల మల్లయ్య తన వ్యవసాయ పొలం వద్ద గేదె, లేగ దూడను కట్టేశాడు. అదే ప్రాంతంలో వరి కోత పనులు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి అటువైపు వచ్చిన పులి లేగ దూడపై దాడి చేసి చంపేసింది. అక్కడే వరి కోతలు చేపడుతున్న మిషన్‌డ్రైవర్ లోకేశ్ పులిని చూసి కోతలు నిలిపేసి పారిపోయినట్లు చెప్పారు.

పులి సంచారంతో భయం..

గత కొంత కాలంగా అప్పాజీపల్లి, సీతానగర్, కాయిదంపల్లి గ్రామాలలో పులి సంచరిస్తున్నట్లు పుకార్లు ఉన్నాయి. ఫారెస్టు అధికారులు అప్పాజీపల్లి అటవీ ప్రాంతంలో పర్యటించి విచారణ చేశారు. అక్కడ పులి సంచారం లేదని తేల్చారు.

ప్రస్తుతం కాయిదంపల్లి శివారులో పులి సంచరిస్తుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో రాళ్ల గుట్టలు, గుహలు, అటవీ ప్రాంతం ఉంది. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఫారెస్ట్ అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

పులి జాడను పసిగట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్ తెలిపారు. పంటపొలాలకు పనుల నిమిత్తం వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్

పెంకుటిళ్లు దగ్ధం



బాధితురాలు సుశీల

వర్గల్(గజ్వేల్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిళ్లు దగ్ధమైన ఘటనలో వస్తు సామగ్రి, బియ్యం నిల్వలు, బట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.6.5లక్షల పైగా నష్టం వాటిల్లింది. ఈ ఘటన వర్గల్ మండలం శాకారంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..శాకారం గ్రామానికి చెందిన పంగ సుశీల భర్త మృతి చెందడంతో తన ఇంటి వద్దే కూతురు, అల్లుడు ఉంటున్నారు. సుశీల రైస్‌మిల్‌లో కూలీ పని చేస్తుంది. కూతురు, అల్లుడు కూడా దినసరి కార్మికులే. బుధవారం ఉదయం10.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు చెలరేగి ఇంట్లో వస్తువులను తాకి ఇంటి పైకప్పుదాకా వ్యాపించాయి. ఇంటి పైనుంచి పొగలు గమనించిన గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మండుటెండ కావడంతో అతికష్టంగా ఇరుగుపొరుగు ఇళ్లకు మంటలు వ్యాపించకుండా ఆపగలిగారు. తరువాత అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు పూర్తిగా చల్లార్చారు. ఈ ప్రమాదంలో డ్రెస్సింగ్ టేబుల్, మంచం, బీరువా, టీవీ, దుస్తులు, బంగారు నగలు, రూ.4.5లక్షల నగదు, బియ్యం తదితర నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి కాలిపోయాయి. సుమారు రూ.6.5లక్షల పైచిలుకు నష్టం వాటిల్లిందని బాధితురాలు బోరున విలపించింది. ఘటన స్థలాన్ని ఆర్‌ఐ రాజు సందర్శించి పంచనామా నిర్వహించారు. సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డామని బాధితురాలు పంగ సుశీల ఆవేదన వ్యక్తం చేసింది. అన్ని పోగొట్టుకున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు ఆర్‌ఐకి విజ్ఞప్తి చేసింది.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: కుళ్లిన స్థితిలో ఓ మృతదేహం లభ్యమైన సంఘటన భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం..పటాన్ చెరు మండలం కర్దనూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం వద్ద బ్లాక్ నెంబర్ 9 వద్ద బుధవారం కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించింది. ఆ మృతదేహాన్ని సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహించే గూడు కుమార్‌గా గుర్తించారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



బాలమణి (ఫైల్)

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లిలో బుధవారం వడదెబ్బతో ఉపాధి కూలీ మ్యాదరి బాలమణి (46) మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..మంగళవారం ఉపాధి పనులకు వెళ్లిన బాలమణి వడదెబ్బతో తీవ్ర అస్వస్తతకు గురైంది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మృతిచెందింది.

కృష్ణ జింక మృతి కారకులపై చర్యలకు డిమాండ్



కృష్ణ జింక మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నారాయణఖేడ్: కృష్ణ జింక మృతి కారకులపై నాగల్‌గిద్ద మోర్గి శివారులోని జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ఫామ్‌ల్యాండ్ సంస్థ వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, జిల్లా బాధ్యులు సురేశ్ నాయక్, బీఎస్పీ ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు అలిగే జీవన్‌కుమార్ తదితరులు బుధవారం కృష్ణ జింక మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం నారాయణఖేడ్‌లో అటవీశాఖ రేంజ్ అధికారి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ఫాంల్యాండ్ నిర్వాహకులు ఇనుప కంచెలు వేయడంతో కృష్ణ జింక మృతి చెందిందని వారు ఆరోపించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జింకను చంపితే జైలు

జింకల మరణాలకు ఎవరు కారకులైనా కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ అటవీశాఖ రేంజి అధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. నాగల్‌గిద్ద మండలం మోర్గి శివారులోని జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ఫాంల్యాండ్ సమీపంలోని కంచెవద్ద మరణించిన కృష్ణ జింక కళేబరాన్ని పశువైద్యాధికారి డా.లక్ష్మి ఆధ్వర్యంలో పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం అటవీ ప్రదేశంలో పంచుల సమక్షంలో కృష్ణ జింకను పూడ్చివేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి మాట్లాడుతూ జింకలు తిరిగే మోర్గి, శిఖార్‌ఖాన, ఔదత్‌పూర్ తదితర ప్రదేశాలన్నింటినీ పరిశీలించామని, వాటి జీవనానికి ఇబ్బంది కల్గిస్తే చర్యలు తప్పవని అన్నారు.